సాక్షి చిత్తూరు

సోమవారం। 10। జూలై। 2023



బోయకొండ జనసంద్రం

బోయకొండ గంగమ్మ దర్శనార్థం ఆదివారం భక్తులు వేలాదిగా తరలిరావడంతో కొండ జనసంద్రంగా మారింది. - 8లో



గ్రా'మీన' యువతకు ప్రోత్సాహం

ఫిష్ ఆంధ్ర పేరుతో ప్రభుత్వం చేపల దుకాణాలను ఏర్పాటు చేసి గ్రామీణ యువతకు ఉపాధి కల్పిస్తోంది. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	33	25
తిరుపతి	34	25
తిరుమల	30	22
గూడూరు	36	28
నగరి	34	26

న్యూస్‌రీల్

బధిరుల క్రీడా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి



బధిరుల క్రీడా ఫెడరేషన్ కార్యవర్గం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ఏపీ ఎన్జీవో సంఘ కార్యాలయంలో ఆదివారం చిత్తూరు జిల్లా బధిరుల క్రీడా ఫెడరేషన్ నూతన జిల్లా కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలకు అబ్జర్వర్‌గా తాతారావ్, రిటర్నింగ్ ఆఫీసర్‌గా ఎస్‌వీ.బాలిరెడ్డి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా హేమంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా విక్రమ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా అనిల్ కుమార్, ట్రెజరర్‌గా జయచంద్ర, ఈసీ సభ్యులుగా మనోజ్, శ్యాంకుమార్, భాస్కర్, ఏలుమలై లను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

కళామందిరం సేవలు ఘనం



పురస్కారాలందుకున్న కవులు, రచయితలు, పిల్లలతో సమితి నిర్వాహకులు

పలమనేరు: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో నిర్మించిన కళామందిరం ద్వారా అందిస్తున్న సేవలు ఘనమైనవని నవ్యాంధ్ర రచయితల సంఘం జాతీయ అధ్యక్షురాలు తేళ్ల అరుణ పేర్కొన్నారు. స్థానిక కళామందిరం తొలి వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన పిల్లలకు సమితి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న డా.లక్ష్మీ రాఘవ, సింహాద్రి జ్యోతిర్మయి, తిరుపతి, మునిరత్నం, పూసల రవి, చంద్రశేఖర్‌నాయుడు, వెంకటరాఘవన్, వీరభద్రగౌడు, జనార్ధనరావు, పలమనేరు బాలాజీ, సీతారామయ్య, సాధనకుమార్‌కు వార్షికోత్సవ పురస్కారాలు అందించి, ఘనంగా సన్మానించారు.

భాషా సేవారత్న బిరుదు ప్రదానం

తెలుగు భాషాభివృద్ధికోసం నిర్విరామంగా కృషి చేస్తున్న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తులసీనాథం నాయుడికి పలువురు కవులు, సేవా, ప్రజాసంఘాల ప్రతినిధులు తెలుగుభాషా సేవారత్న బిరుదును ప్రదానం చేశారు.

2న స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : స్పెషల్ సమ్మరీ రివిజన్ కసరత్తుపై ఆగస్టు 2, 3 తేదీల్లో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి కలెక్టరేట్‌కు ఇటీవల ఉత్తర్వులు అందాయి. ఆ ఉత్తర్వుల మేరకు ఆగస్టు 2, 3 తేదీల్లో విశాఖపట్టణంలో డీఈవో (డిస్ట్రిక్ట్ ఎలక్షన్ ఆఫీసర్)లతో సమావేశం ఉంటుందన్నారు. ఆ సమావేశానికి జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ హాజరుకానున్నారు. జిల్లాలో ఓటర్ల స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ని సిద్ధం చేసి ఈ నెల 25వ తేదీలోపు రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపేందుకు ఎన్నికల అధికారులు చర్యలు చేపడుతున్నారు.

కులం చూడం.. మతం చూడం.. పార్టీ చూడం. అర్హులందరికీ పథకాలు వర్తింపజేస్తాం అంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన వైఎస్ జగన్, అధికారంలోకి వచ్చిన తరువాత అదే నినాదంతో ముందుకెళుతున్నారు. అర్హతే ప్రామాణికంగా నవరత్న పథకాలను పేదల ముంగిటకే అందజేస్తున్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ఇలాంటి ప్రభుత్వాన్ని ప్రజలు వచ్చే ఎన్నికల్లోనూ ఆదరించాలి.

– మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అర్హతే ప్రామాణికం.. ఇదే జగన్నినాదం

- పార్టీలు, కులాలకతీతంగా పథకాల అమలు
- విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- టీడీపీ నుంచి 80 మంది వైఎస్సార్‌సీపీలోకి చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు రంగయ్య, రెడ్డెప్ప

పుంగనూరు: రాష్ట్ర చరిత్రలో పార్టీలకు, కులాలకు, మతాలకు తావు లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. పుంగనూరు మున్సిపాలిటీలో ఆదివారం 750 మంది వీధి వ్యాపారులకు రూ.30 లక్షలు విలువ చేసే సోలార్ దీపాలను చిత్తూరు, అనంతపురం ఎంపీలు రెడ్డెప్ప, రంగయ్యతో కలసి పంపిణీ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు అందిస్తోందని గుర్తుచేశారు. ప్రస్తుతం అడిగిన వారందరికి పింఛన్లు మంజూరు చేస్తున్నామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు సూచించిన వారికే పింఛన్లు ఇచ్చేవారని చెప్పారు. ఎవరికైనా కొత్త పింఛను రావాలంటే, పింఛను తీసుకుంటున్న వారు ఒకరు చనిపోతేనే ఇచ్చేవారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్న పథకాలను అందిస్తున్నామన్నారు. మిగిలిన సమస్యలను పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని తెలిపారు. సురక్ష కార్యక్రమం ఈనెలాఖరు వరకు జరుగుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల ఇంటి వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. గత ప్రభుత్వాల పరిపాలనకు భిన్నంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా భావించి, ముందుకెళుతోందని స్పష్టం చేశారు. ఇలాంటి నూతన కార్యక్రమాలను ప్రవేశపెట్టి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రెండవ సారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు.

పులివెందుల తరహాలో అభివృద్ధి

పుంగనూరు నియోజకవర్గాన్ని మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి పులివెందుల తరహాలో అభివృద్ధి చేస్తున్నారని ఎంపీ రెడ్డెప్ప కొనియాడారు. చిరు వ్యాపారాల కష్టాన్ని గుర్తించి మంత్రి సోలార్ లైట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టడం హర్షణీయమన్నారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో కూడా సిమెంటు రోడ్లు, కాలువలు, ఓవర్ హెడ్‌ట్యాంకులు, ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలకు మౌళిక వసతులు ఏర్పాటు చేసిన ఘనత పెద్దిరెడ్డి కుటుంబందేనని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 80 మంది

రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో తెలుగుదేశం కార్యకర్తలు 80 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివా రం పట్టణంలో పీఎల్‌ఆర్ పండ్ల వ్యాపారుల సంఘం అధ్యక్షుడు అఫ్సర్ ఆధ్వర్యంలో 80 మంది టీడీపీకి చెందిన కార్యకర్తలు చేరారు. వీరికి మంత్రి పెద్దిరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ కార్యక్రమాల్లో సోలార్ కంపెనీ ఎండీ కమలాకర్, నెట్‌క్యాప్ జీఎం ఎర్రమరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, పట్టణ అధ్యక్షుడు కెఎస్‌ఏ.ఇఫ్తికార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న రికార్డు

సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏముఖ్యమంత్రీ అమలు చేయలేదని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య అన్నారు. పుంగనూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సోలార్ దీపాలను వీధి వ్యాపారులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. సోలార్ కంపెనీ వారు ఈ లైట్ల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు.

పుష్పపల్లకిపై రామచంద్రుడి విహారం



పుత్తూరు వీధుల్లో పుష్పపల్లకిపై విహరిస్తున్న శ్రీరామచంద్రుడు



ప్రత్యేక అలంకరణతో శ్రీరామచంద్రస్వామి

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండరామస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పుష్పపల్లకి సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అర్చకులు సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఉభయదారులచే అర్చకులు స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం భక్తితో దీపధూపనైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకొని భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం భయదారులచే స్వామికి ఊంజల్ సేవను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉభయదారులు పూజాసామగ్రి, ప్రసాదాలు, పుష్పమాలలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు స్వామికి పూజలు చేసి ఊంజల్‌సేవను భక్తితో నిర్వహించారు. రాత్రి భక్తజన సంద్రం మధ్య పుష్ప పల్లకి సేవను వేడుకగా నిర్వహించారు. విద్యుత్‌కాంతులతో మెరుస్తున్న పుష్ప పల్లకిలో శ్రీరామచంద్రుడు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. పుష్పపల్లకి తిలకించడానికి విచ్చేసిన భక్తులతో టి.పుత్తూరు జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాటకచ్చేరి భక్తులను అలరింపజేసింది. ఆలయంలో సోమవారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్ సేవ, రాత్రిలో కల్పవృక్ష వాహన సేవ నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్ధేశ్వర రెడ్డి తెలిపారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



జల ప్రసాద కేంద్రాల వద్ద దాత కుటుంబ సభ్యులతో ఆలయ చైర్మన్, అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో ఆదివారం ఉదయం నుంచి స్వామివారి దర్శనార్థం భక్తులు తరలివచ్చారు. దీంతో స్వామివారి కంపార్ట్‌మెంట్లు, క్యూలన్నీ భక్తులతో నిండిపోయి ఆలయం వెలుపల వరకు బారులు తీరారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తగు చర్యలు తీసుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం కల్పించారు. వీఐపీ గేట్ వద్ద ఆలయ సిబ్బంది, అధికారులు ఎవరెవరని అనుమతిస్తున్నారని ఆరా తీశారు. వీఐపీ గేట్‌లో ప్రొటోకాల్ ఉన్న వారికి మాత్రమే అనుమతులు ఉంటాయని తెలిపారు.

జలప్రసాద కేంద్రాలు ఏర్పాటు

వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పరిసరాల్లో దాత ఇచ్చిన విరాళంతో మూడు జలప్రసాద కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో నివాసమున్న పద్మావతి, ఉమాశంకర్ దీక్షితులు ఆలయ పరిసరాలలో జలప్రసాదాల ఏర్పాటుకు రూ.7.50 లక్షల విరాళం అందించారు. దాత ఆదివారం కాణిపాకానికి విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి ఆయన చేతుల మీదుగా జల ప్రసాదాలు ప్రారంభించారు. వారికి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. అనంతరం దాతకు ఆలయం తరపున ఆలయ చైర్మన్, ఈఓ, అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, హరి మాధవ రెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి, ఏఈ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

విషాద యాత్ర

'ఒక్క రోడ్డు ప్రమాదం.. మూడు కుటుంబాలకు చెందిన ఆరుగురిని మృత్యుఒడికి చేర్చింది. దైవదర్శనానికి వచ్చి వెళ్తూ జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలోని శ్రీకాళహస్తి పట్టణానికి కూతవేటు దూరంలో జరిగిన ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు దుర్మరణం పాలవగా, ఓ యువకుడు స్వల్పగాయాలతో బయటపడి మృత్యుంజయుడిగా మిగిలాడు.

- అతివేగం తెచ్చిన అనర్థం
- ఆరుగురిని బలిగొన్న రోడ్డు రక్కసి
- దైవదర్శనానికి వచ్చి .. తిరిగిరాని లోకాలకు
- శ్రీకాళహస్తిలో ఘోర రోడ్డు ప్రమాదం



ఢీకొన్న వాహనాలు

రేణిగుంట, శ్రీకాళహస్తి: విజయవాడ కృష్ణలంక బాలాజీ టవర్స్‌లో రమేష్‌బాబు(45), ఆయన భార్య రాజ్యలక్ష్మి(40), కుమారులు రేవంత్, భరత్ నివసిస్తున్నారు. రమేష్‌బాబు భవన నిర్మాణ రంగంలో కూలీలకు అందించే లేబర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వీరి పెద్ద కుమారుడు రేవంత్ బీటెక్ చదువుతుండగా, చిన్నకుమారుడు భరత్ ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. రాజ్యలక్ష్మి సోదరి శ్రీలత(42) ఉయ్యూరులోని అక్కబజారులో నివాముంటూ అక్కడ క్యాటరింగ్ చేసుకుంటూ ఒక్కగానొక్క కొడుకుని ఇంజినీరింగ్ చదివిస్తోంది. అలాగే రాజ్యలక్ష్మి స్నేహితురాలు వెంకటరమణమ్మ (38), ఆమె భర్త నరసింహమూర్తి(47), కుమార్తె అక్షయ(17) కూడా కృష్ణలంక ప్రాంతంలోనే నివసిస్తున్నారు. రమేష్‌బాబు, రాజ్యలక్ష్మి, భరత్(17), శ్రీలత, వెంకటరమణమ్మ, నరసింహమూర్తి, అక్షయ మొత్తం ఏడుగురు ఒకే కారులో శుక్రవారం రాత్రి విజయవాడ నుంచి తిరుమలకు వచ్చారు. ఆదివారం ఉదయం తిరుమలేశుని దర్శించుకున్నారు. అక్కడి నుంచి కారులో తిరుగుపయనమై, మార్గమధ్యంలోని శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకుని అక్కడి నుంచి విజయవాడకు వెళ్లాలని నిర్ణయించుకుని తిరుమల కొండ దిగారు. తర్వాత తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకుని అక్కడి నుంచి శ్రీకాళహస్తికి బయలుదేరారు. అతివేగంతో పాటు కారులో ప్రయాణిస్తున్న ఏ ఒక్కరూ సీటుబెల్ట్ పెట్టుకోలేదు. ఇది కూడా ఈ విషాదానికి ఒక కారణమైంది.

మృత్యుంజయుడు భరత్

రాజేశ్వరి, రమేష్‌బాబు కుమారుడు భరత్ వెనుక సీటులో అలసిపోయి నిద్రిస్తున్నాడు. అయితే తాను ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురై పెద్ద శబ్దం వచ్చింది. నిద్రలో నుంచి తేరుకుని చూసేలోపే చిన్నపాటి రక్తగాయాలున్నాయి. అతని కళ్లెదుట తల్లిదండ్రులిద్దరూ విగతజీవులుగా పడి ఉండడం, పెద్దమ్మ శ్రీలత, తోడుగా వచ్చిన కుటుంబానికి చెందిన ముగ్గురూ మృతి చెంది పడి ఉండడంతో భరత్ బోరున విలపిస్తూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కారులో ఇరుక్కున్న వారిని స్థానికులు బయటకు లాగి రక్షించే ప్రయత్నం చేశారు. నిమిషాల వ్యవధిలో సీఐ అంజూయాదవ్, సిబ్బంది చేరుకుని గాయాలైన భరత్‌ను ఏరియా ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

నరసింహ మూర్తి ఫ్యామిలీలో ముగ్గురూ చనిపోయారు. శ్రీలత భర్త సుధాకర్ కొన్నేళ్ల కిందట చనిపోయాడు.. ఇప్పుడు ఆమె కన్నుమూయడంతో కుమారుడు అనాథగా మిగిలాడు.

– రాజేశ్వరి, రమేష్ బాబు దంపతులు మృతి చెందడంతో కుమారులు ఇద్దరూ అనాథలయ్యారు.. వారిలో ఒకరు ప్రమాదం జరిగిన కారులో ఉండి మృత్యువు నుంచి తప్పించుకోగా, పెద్ద కుమారుడు రేవంత్ వీరితో పాటు రాకపోవడంతో ముప్పు తప్పించుకున్నాడు.

శ్రీకాళహస్తి సన్నిధికి మరికొద్ది దూరంలో..

శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధికి మరికొద్ది నిమిషాల వ్యవధిలో చేరుకునేలోపే శ్రీకాళహస్తి పట్టణం, మిట్టకండ్రిగ సమీపంలో ఎదురుగా విజయవాడ నుంచి హోసూరు వెళుతున్న మొక్కజొన్న లోడ్డుతో కూడిన లారీని వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం లారీ ముందు చక్రాల కిందకు ఇరుక్కుపోయి నుజ్జునుజ్జు అయింది. కారు నడుపుతున్న రమేష్‌బాబు, పక్క సీటులో కూర్చున్న మూర్తి కారుసీటులోనే ఇరుక్కుని మృతి చెందారు. వెనుక సీటులో కూర్చున్న రాజ్యలక్ష్మి, శ్రీలత, రమణి, అక్షయ అక్కడికక్కడే మృతి చెందారు. భరత్ ఒక్కడే స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

క్లుప్తంగా

పేదలు, పెత్తందారుల మధ్యే మహా సంగ్రామం



తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట డిప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుమల: రాబోయే మహాసంగ్రామం పేదలు, పెత్తందారుల మధ్యే ఉంటుందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. ఆదివారం ఆయన తిరుమల శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలను, దేవుడిని నమ్ముకుంటే చంద్రబాబు నాయుడు మాత్రం కోటీశ్వరులను, వెన్నుపోటుదారులను నమ్ముకుంటున్నారన్నారు. ప్రజలకు నిస్వార్థమైన సేవ అందిస్తున్న వారే మళ్లీ విజయ బావుటా ఎగురవేస్తారని చెప్పారు. ఎవరైతే దుర్మార్గంగా, అక్రమంగా నిలుస్తారో.. స్కీంలపై కడుపు మండి బాధపడుతున్నారో వారిని ప్రజలు తిరస్కరిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

గ్రా'మీన' యువతకు ప్రోత్సాహం

చేపల మార్కెట్ అంటేనే వ్యర్థాల నిలయం. అపరిశుభ్రతకు మారుపేరు. అయితే ఫిష్ ఆంధ్ర పేరుతో ప్రభుత్వం చేపల మార్కెట్ రూపురేఖలు మార్చేసింది. పట్టణాల నుంచి గ్రామాల వరకు ఫిష్ ఆంధ్ర దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి చర్యలు చేపట్టింది. అందులో భాగంగా గ్రామీణ యువతకు సబ్సిడీలు అందిస్తోంది. మత్స్య సంపదను పెంచేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. తద్వారా పరిశుభ్రతతోపాటు సరసమైన ధరలకు నాణ్యమైన చేపలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ఇటు మత్స్యకారులకు, విక్రయదారులకు, వినియోగదారులకు బాసటగా నిలుస్తోంది.

- జిల్లా వ్యాప్తంగా ఫిష్ ఆంధ్ర యూనిట్లు
- సబ్సిడీ ధరతో ప్రభుత్వ ప్రోత్సాహం
- పరిశుభ్రతకు ప్రాధాన్యత



నగరి: ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్‌ను ప్రారంభించిన నాయకులు, అధికారులు (ఫైల్)

సాక్షి, చిత్తూరు: చేపల వినియోగంతో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే ప్రకటించింది. అందుకే దీన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్)ను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాయి. అందులో భాగంగానే ఫిష్ ఆంధ్ర – ఫిట్ ఆంధ్ర పేరుతో చేపల మార్కెట్లను పట్టణాల నుంచి గ్రామాల వరకు అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. నిరుద్యోగులకు అండగా చేపల దుకాణాల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు అందిస్తున్నాయి. దుకాణాలు కావాల్సిన వారు రూ.30 వేలు డిపాజిట్ చేస్తే మిగిలిన సొమ్మును బ్యాంకులు అందజేస్తాయి. యూనిట్ ధర రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుంది. పది నుంచి 12 అడుగుల విస్తీర్ణంలో దుకాణం ఏర్పాటవుతుంది. అలాంటి వారికి మత్స్యశాఖ ఫిష్ ప్రాసెసింగ్, నిల్వ, కటింగ్‌పై శిక్షణ ఇస్తుంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అమ్మాల్సి ఉంటుంది.

మత్స్యశాఖ పథకాలకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తోంది. జిల్లాలోని మొత్తం 31 మండలాల్లో 112 యూనిట్లలో ఇప్పటికే 60 రిటైల్ ఫిష్ అవుట్లెట్స్ ఏర్పాటయ్యాయి. కుప్పం, పలమనేరు, పుంగనూరు, చిత్తూరు, నగరి, బంగారుపాళ్యం, చౌడేపల్లి, కార్వేటినగరం ప్రాంతాల్లో ఈ ఫిష్ ఆంధ్ర రిటైల్ యూనిట్లు ఏర్పాటయ్యాయి. ఈ ప్రాంతాల్లో ఆదివారం నుంచి బుధవారం వరకు చేపల విక్రయాలు కొనసాగుతున్నాయి. చేపల వినియోగానికి అనుగుణంగానే వాటి పెంపకంపైన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలోని సుమారు 7వేల చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేపల పెంపకం జోరుగా సాగుతోంది.



విక్రయిస్తున్న నాణ్యమైన చేపలు

ప్రభుత్వం అందించే సబ్సిడీ

- ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద 40 శాతం సబ్సిడీలో రాష్ట్రం 16 శాతం, కేంద్రం 24 శాతం సబ్సిడీ అందిస్తోంది.
- రద్దీ ప్రదేశాల్లో చేపలు విక్రయించేందుకు జిల్లాకు 10 మొబైల్ ఫిష్ వెండింగ్ యూనిట్లు కేటాయించారు. ఒక యూనిట్ ధర రూ.3 లక్షలు ఉండగా, ఎస్సీలు, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఇస్తున్నారు.
- చేపల రవాణాకు 6 వాహనాలు జిల్లాకు కేటాయించారు. దీని యూనిట్ ధర రూ.20 లక్షలు ఉండగా, ఎస్సీలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఉంటుంది.
- చేపల నిల్వ కోసం జిల్లాకు 26 ఫిష్ కియోస్క్‌లు మంజూరయ్యాయి. వీటి కోసం 25 ద్విచక్ర వాహనాలు పంపిణీ చేశారు.
- చేపల విక్రయం కోసం అధునాతన సదుపాయాలతో కూడిన 129 ఆటోలు మంజూరయ్యాయి. అందులో ఐదు పంపిణీ చేశారు. మిగిలినవి త్వరలోనే పంపిణీ చేయనున్నారు.
- ఫిష్ ఆంధ్ర ఔట్‌లెట్లు జిల్లాకు 112 మంజూరయ్యాయి. ఇందులో 60 ఏర్పాటు చేశారు. ప్రతి మండలంలో ఒకటి తక్కువగాకుండా ఏర్పాటు చేస్తున్నారు. దీని ధర రూ.1.50 లక్షలు. అందులో రూ.30వేలు దుకాణదారుడు భరించగా, మిలిగిన మొత్తం సబ్సిడీ లభించనుంది.
- ఇక ఫిష్ ఆంధ్ర రెండో దశ యూనిట్ ధర రూ.10 లక్షలు ఉండగా, ఎస్సీలు, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఉంటుంది.
- జిల్లాలో అధిక మొత్తంలో చేపల నిల్వలు, పంపిణీ కోసం భారీ స్థాయిలో రెండు ఫిష్ వాల్యుయాడెడ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటి యూనిట్ ధర రూ.50 లక్షలు, ఇందులో ఎస్సీలు, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ లభిస్తోంది.
- జిల్లా కేంద్రంలో ఒక ప్రధాన అవుట్‌లెట్ రూ.కోటితో ఏర్పాటు కానుంది. ఇందులో ఎస్సీలు, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ లభిస్తోంది.

మేలు జరిగింది



గతంలో చేపలు అమ్ముకోవాలంటే రోడ్లపై ఎండ, వానల్లో ఇబ్బందులు పడేవాళ్లం. ఈ ఫిష్ ఆంధ్ర పథకం ద్వారా ఒక దుకాణం ఇచ్చారు. అందులో చేపలు నిల్వ చేసుకోవడానికి అన్ని వసతులు కల్పించారు. దీని కోసం నాకు మొత్తం రూ.25 వేలు మాత్రమే ఖర్చయింది. ఈ పథకం ద్వారా మాకు మరింతగా వ్యాపారం చేసుకోవడానికి వీలుంటుంది.

-దినకర్, విక్రయదారుడు, కార్వేటినగరం

జగన్‌తోనే మాకు గౌరవం దక్కింది



గత 15 సంవత్సరాలుగా ఈ వ్యాపారం చేస్తున్నాము. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం ఉండేది కాదు. అయితే జగనన్న సీఎం అయ్యాక మాకు గౌరవం ఇచ్చారు. సగర్వంగా వ్యాపారం చేసుకునేలా ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు. రుణంతో ఈ దుకాణం ఏర్పాటు చేసుకున్నాం. ఈ రుణం వాయిదాలను సకాలంలో చెల్లించుకోగలం.

- ఫాతిమాబి, నింద్ర, అమ్మకందారు

బ్యాంకు రుణాలు ఇప్పిస్తున్నాం



చేపల అమ్మకాన్ని ప్రోత్సహిస్తున్నాం. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నాం. మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇస్తున్నారు. గతంలో సగటు ఒక వ్యక్తి ఏడాదికి ఐదు నుంచి 8 కిలోలు చేపలు మాత్రమే ఆహారంగా తీసుకుంటున్నారు. సబ్సిడీ ఉపయోగించుకొని వ్యాపార అభివద్ధి చేసుకోవచ్చు. మత్స్యశాఖ అందుబాటులో ఉంటుంది.

-రవికుమార్ రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి

నిరుద్యోగులు వినియోగించుకోండి



అత్యధిక పోషకాలున్న మత్స్యసంపద ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా ప్రజలు అధికంగా చేపలు వినియోగించుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర యూనిట్లను ఏర్పాటు చేస్తోంది. జిల్లాలోని నిరుద్యోగులు ఫిష్ ఆంధ్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- సగిలి షణ్మోహన్, జిల్లా కలెక్టర్, చిత్తూరు

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న కలెక్టరేట్‌లో స్పందన నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే స్పందనకు ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో తెలియజేయాలన్నారు. దీనికి ఆయా శాఖల అధికారు లు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని పేర్కొన్నారు.

మల్లికార్జునకు మంత్రి అభినందన



గిన్నిస్ రికార్డు సాధించిన మల్లికార్జునను అభినందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సదుం: ఇటీవలే మూడో గిన్నిస్ రికార్డు సాధించిన మల్లికార్జున మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను మంత్రి అభినందించారు. మూడు సార్లు గిన్నిస్ రికార్డు సాధించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, పుత్రాజు, సర్పంచ్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బావిలో తేలిన మహిళ మృతదేహం



బైరెడ్డిపల్లి: మండలంలోని వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. మండలంలోని లక్కనపల్లి సమీపాన రోడ్డు పక్కన బావిలో మహిళా మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతురాలు బ్లూ రంగు చీర ధరించిందని, వయస్సు 40–50 ఏళ్ల లోపు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ మహిళ వివరాలు తెలిసిన వారు 9440900696 ను సంప్రదించాలని సూచించారు.

తనయను చూసేందుకు వెళ్లి తల్లి మృతి



మృతి చెందిన అమరావతి

పుంగనూరు: కుమార్తెను చూసేందుకు వెళ్లిన తల్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన ఈడిగపల్లె వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, చౌడేపల్లె మండలం కావలివారిపల్లెకు చెందిన గోవిందు భార్య అమరావతి(35) తమ సమీప బంధువు మునిగంగులప్పతో కలసి గుర్రంకొండ గురుకుల పాఠశాలలో చదువుతున్న కుమార్తెను చూసేందుకు ద్విచక్ర వాహనంపై బయల్దేరింది. మార్గమధ్యంలో ఈడిగపల్లె వద్ద ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొనడంతో అమరావతి అక్కడికక్కడే మృతి చెందింది. మునిగంగులప్ప తీవ్రంగా గాయపడడంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు పుంగనూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనతో కావలివారిపల్లెలో విషాద చాయలు అలుముకున్నాయి.

కారు బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



పూతలపట్టు: చిత్తూరు–తిరుపతి జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కారు–బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని కరినిపల్లెకు చెందిన కృష్ణారెడ్డి(42), శశికుమార్ గ్రామం నుంచి పాకాలకు ద్విచక్ర వాహనంపై తిరుపతి వైపు బయల్దేరారు. వేము కళాశాల యజమాని తన కారులో చిత్తూరు వైపు వస్తుండగా జాతీయ రహదారిలో పోటు కనుమ వద్ద ఎదురెదురుగా ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం వెనుక వైపు ఉన్న కృష్ణారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, నడుపుతున్న శశికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆయన్ను వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారులో ఉన్న వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనసంద్రంగా బోయకొండ

చౌడేపల్లె: జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రంగా పేరొందిన బోయకొండ ఆదివారం జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన ఆషాఢమాసంలో రద్దీ అధికంగానే ఉంటుంది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సుమారు 45 వేల మందికి పైగా భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి తెలిపారు. ఆలయ అర్చకులు అమ్మవారిని రంగురంగుల పూలు, బంగారు నగలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఎటు చూసినా భక్తులతోపాటు వాహనాల రాకపోకలతో బోయకొండ, పరిసర ప్రాంతం కిటకిటలాడింది. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు నిఘా ఏర్పాటుచేశారు. అమ్మవారి ఆలయంలో ఆదివారం వివిధ సేవా టికెట్ల విక్రయాల ద్వారా ఆలయానికి రూ.13.5 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ చంద్రమౌళి తెలిపారు.



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

ఓ రామ నీ నామమెంతో రుచిరా!

తిరుమల: తిరుమల నాదనీరాజనం వేదికపై ఆదివారం ఒకటో విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తజనరంజకంగా సాగింది. శ్రీ హనుమత్ సమేత సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆద్యంతం రామనామస్మరణతో మార్మోగింది. ఇందులో 1 నుంచి 3 సర్గల వరకు గల 156 శ్లోకాలను పారాయణం చేశారు. ధర్మగిరి వేద పాఠశాల పండితులు ఆచార్య రామానుజాచార్యులు, అనంత గోపాలకృష్ణ, పీవీఎస్ఎన్. మారుతి శ్లోక పారాయణం చేశారు. అఖండ పారాయణంలో ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థకు చెందిన వేద పారాయణదారులు, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన పండితులు పాల్గొన్నారు. పారాయణం ప్రారంభానికి ముందు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు ఉదయ్‌భాస్కర్ బృందం, చివర్లో హైదరాబాద్‌కు చెందిన నాగరాజు బృందం భజన కీర్తనలను శ్రవణానందంగా ఆలపించింది. కార్యక్రమంలో ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖకుమార్, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ ఆచార్య కుప్పా శివసుబ్రమణ్య అవధాని, పండితులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అయోధ్యకాండ అఖండ పారాయణంలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామికి హారతి ఇస్తున్న వేదపండితులు

భగవద్గీతతో ఆధ్యాత్మిక జీవనం



అనుగ్రహభాషణం చేస్తున్న ఉడిపి పీఠాధిపతి సుగుణేంద్ర తీర్థ స్వామీజీ

తిరుపతి కల్చరల్ : సమాజంలో ఆధ్యాత్మిక జీవనానికి భగవద్గీతే చక్కటి మార్గమని ఉడిపి పుత్తిగే పీఠాధిపతి సుగుణేంద్ర తీర్థ స్వామిజీ వెల్లడించారు. ఆదివారం తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో ఇస్కాన్ మందిరం ఆవరణలోని సమావేశ మందిరం వద్ద విఠల పూజ, కోటి గీతా లేఖన యజ్ఞం చేపట్టారు.ఈ సందర్భంగా స్వామీజీ విఠల పూజ కోటి భగవద్గీత యజ్ఞం విశిష్టతను వివరించారు.భక్తులందరూ ప్రతి రోజూ గీతలోని ఒక శ్లోకం రాయాలని సూచించారు. భగవద్గీత శ్లోకాలను రాసిన పుస్తకాలను ఉడిపి శ్రీకృష్ణుడి ఆలయంలో సమర్పించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. అనంతరం ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతీ రమణ దాస్, కార్యదర్శి లీలాపారాయణదాస్, ఇస్కాన్ ప్రతినిధులు స్వామీజీకి రాధాకృష్ణుల చిత్రపటం, ప్రసాదం అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తిరుపతి బ్రాహ్మణ సమాజం ప్రధాన కార్యదర్శి, కోటి గీత లేఖన యజ్ఞం ప్రోగ్రామ్ కన్వీనర్ కొత్తపల్లి అజయ్‌కుమార్, కో–కన్వీనర్ హరిప్రసాద్, వేషాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కొత్తపల్లి విజయ్‌కుమార్, వేదం హరిప్రసాద్, ఏపీ బ్రాహ్మణ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ప్రతినిధులు రతీష్ ఆచారి, ప్రసన్న, చందన్ కారత్, సనత్‌కుమార్ పాల్గొన్నారు.